ఆమోదముద్ర ఉంటేనే సర్టిఫికెట్ చెల్లుబాటు

- *విదేశాలకు వెళ్లే విద్యార్థుల కోసం జీపడీలో తత్కాల్ సేవ*
- *సందేహాలుంటే సంప్రదించాలన్న పాస్‌పోర్ట్ అధికారిణి స్నేహజ*

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 4 (నమస్తే తెలంగాణ): విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఉన్నత చదువులు చదవడానికి భారత విద్యార్థులు విదేశాలకు పరుగులు తీస్తున్నారు. అయితే సర్టిఫికెట్ల విషయంలో (విద్యార్హత, మ్యారిటల్ స్టేటస్ తదితర సర్టిఫికెట్లు) విదేశీ యూనివర్సిటీలు రకరకాల నిబంధనలను అమలు చేస్తున్నాయి. దీంతో మన సర్టిఫికెట్లు నిజమైనవేనని నిర్ధారిస్తూ హెడ్ ఆఫ్ బ్రాంచ్ సెక్రటేరియెట్ అధికారి ఆమోద్రముద్ర వేస్తే ఇక మనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. అయితే ఈ ఆమోద ముద్ర పొందాలంటే తొలుత మీసేవలో దరఖాస్తు చేసుకుని జీపడీ(జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) అటెస్టేషన్ డాక్యుమెంట్‌ను ఫిల్ చేయాలి. అనంతరం స్లాట్ ఆధారంగా జీపడీ కార్యాలయానికి వెళ్లి సర్టిఫికెట్లను అందజేయాలి. వాటిని సంబంధిత రంగానికి చెందిన కార్యాలయాలకు పంపించి వాటిని నిజనిర్ధారణ చేస్తారు. అయితే ఈ ప్రక్రియ 5 ఏజెన్సీలతో కొనసాగుతుంది. జీపడీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయ్యాక ఏజెన్సీలు వాటిని సేకరించి తిరిగి బ్రాంచ్ సెక్రటేరియెట్ కార్యాలయానికి అందిస్తారు. ఆ అధికారి ఆ సర్టిఫికెట్లు సరైనవేనని ఆమోద ముద్రవేసి అటెస్టేషన్ చేస్తారు. అలా జారీ అయిన సర్టిఫికెట్లు విదేశాల్లో చెల్లుబాటు అవుతాయని హెడ్ ఆఫ్ బ్రాంచ్ సెక్రటేరియెట్, హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ తెలిపారు. జీపడీలో ప్రత్యేక కౌంటర్ ఉంటుంది. ఒక్క సర్టిఫికెట్‌కు రూ.134 ఖర్చు అవుతుంది. ఇందులో ఏజెన్సీ రూ.84, బ్రాంచ్ సెక్రటేరియెట్ రూ.50 ఛార్జీ చేస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తవడానికి మూడు రోజుల సమయం పడుతుంది. కానీ జీపడీలో తత్కాల్ సేవతో ఒక్క రోజులో కూడా పని అయిపోవచ్చు. ఈ ప్రక్రియలో ఏమైన సందేహాలుంటే hobs.hyderabad@mea.gov.inకు మెయిల్ చేయొచ్చని స్నేహజ తెలిపారు.

పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ

నేడు రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి పీసీ ఘోష్ శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇప్పటికే విచారణ ప్రారంభించిన ఆయన గత నెల 6 నుంచి 16 వరకు ఇక్కడే ఉండి ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించారు. కమిషన్ ఎదుట వెల్లడించిన అభిప్రాయాలను అఫిడవిట్ల రూపంలో జూన్ 28లోగా దాఖలు చేయాలని ఆదేశించారు. గడువు ముగిసిపోగా తదుపరి విచారణ ప్రక్రియను కొనసాగించేందుకు ఘోష్ రాష్ట్రానికి వస్తున్నట్లు తెలిసింది.

దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి వైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, నరసింహావార్యులు తదితరులు

అసెంబ్లీలో దొడ్డి కొమురయ్య వర్ధంతి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని శాసనసభాప్రాంగణంలో గురువారం నిర్వహించారు. శాసనమండలి వైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎల్పీ కార్యదర్శి శ్రీకాంత్, చీఫ్ మార్షల్ కరుణాకర్, శాసనమండలి, శాసనసభ ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బరాజ్‌కు భారీగా వరద

ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 16,650 క్యూసెక్కులు

మహదేవపూర్/కన్నాయిగూడెం, జూలై 4 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌కు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద పోటెత్తుతున్నది.16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన బరాజ్‌లో గురువారం ఇన్‌ఫ్లో 16,650 క్యూసెక్కులుగా ఉండగా, 8 బ్లాక్‌లో మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదను దిగువకు వదులుతున్నారు. బరాజ్ రివర్ బెడ్ లెవల్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, ప్రస్తుతం 89.30 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది. నిరుడు ఇదే సమయానికి 93.20 మీటర్ల ఎత్తులో ప్రవహించింది. ప్రస్తుతం బరాజ్ రివర్ బెడ్ నుంచి ప్రవాహం 1.30 మీటర్ల ఎత్తులో ఉన్నది. బరాజ్ వద్ద ప్రవాహాన్ని భారీ నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ తల్లికిఎంత కష్టం!

మొదటిపేజీ తరువాయి...

చేయడాన్ని జీర్ణించుకోలేని గ్రామ కాంగ్రెస్ నాయకులు కొందరు ఎమ్మెల్యే ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి అనుమతి లేదనే సాకుతో విగ్రహం కూల్చివేత కుట్రకు తెరలేపారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త, నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన రూన్సీరెడ్డి, మండల అధికారులు కలిసి పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో గురువారం సాయంత్రం విగ్రహం కూల్చివేతలకు పంచాయతీ సిబ్బంది సిద్ధపడ్డారు.

అడ్డుకున్న స్థానిక మహిళలు

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం అడుగు భాగాన్ని పెకిలించేందుకు పంచాయతీ సిబ్బంది చేసిన ప్రయత్నాన్ని స్థానిక మహిళలు అడ్డుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంతో రాజకీయాలు తగవని, కూల్చివేత ఆపాలని గొడవకు దిగడంతో ఎట్టకేలకు కూల్చివేత ప్రయత్నాన్ని అధికారులు విరమించుకున్నారు. దేవరుప్పుల ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్ఐ చెన్నకేశవులు, ఎంపీవో సురేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అంజలి, ఇతర గ్రామాల సెక్రటరీలు గ్రామపంచాయతీ సిబ్బందిని పురమాయించి విగ్రహాన్ని కూలగొట్టేందుకు ఉపక్రమించారు. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో నిలిపివేశారు. రెండేండ్ల క్రితం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చింత రవి గద్దెను నిర్మించగా, కాలనీకి చెందిన కొందరు వ్యతిరేకించడంతో అంబేద్కర్ విగ్రహాన్ని కామారెడ్డిగూడెం జాతీయ రహదారి పక్కన నెలకొల్పారు. అప్పటి మంత్రి ఎర్రబెల్లి ఆర్థిక సహాయం అందించి విగ్రహాన్ని ప్రారంభించారు. దీంతో ఎస్సీ కాలనీలో వృథాగా ఉన్న గద్దెకు గులాబీరంగు వేసి దాతల సాయంతో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం మొదలైంది. తెలంగాణ తల్లి అందరిదీ అని, గద్దెకు వేసిన గులాబీరంగును మార్చుతానని చింత రవి అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేతో విగ్రహాన్ని ప్రారంభిద్దామని చెప్పినా కాంగ్రెస్ నాయకులు వినిపించుకోలేదని చెప్తున్నారు. గద్దెతోపాటు విగ్రహానికి కప్పిన గులాబీరంగు వస్త్రాన్ని సైతం మార్చినా కాంగ్రెస్ నాయకులు పట్టువీడలేదు. కేవలం చింత రవి ఏర్పాటు చేశాడన్న నెపంతో విగ్రహాన్ని కూలగొట్టాలనడం వివాదాస్పదమైంది.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- **ఈఎంఐలు కట్టకపోవడంతో ఆటో లాక్కెళ్లిన ఫైనాన్స్ కంపెనీ**
- **మనస్తాపంతో సామనపల్లి స్వామి ఆత్మహత్య**
- **సిరిసిల్ల జిల్లా ధర్మారంలో విషాదం**

కోనరావుపేట, జూలై 4: కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మహిళలకు ఫ్రీ బస్సు స్కీంతో ఓ ఆటో డ్రైవర్ ఉపాధి కోల్పోయాడు. గిరాకీ లేక, కుటుంబాన్ని పోషించుకోలేక ఆరు నెలలుగా నరకయాతన అనుభవించాడు. ఈఎంఐలు కట్టకపోవడంతో ఆటోను ఫైనాన్స్ కంపెనీ వారు లాక్కెళ్లడం, సమస్యలన్నీ చుట్టుముట్టడంతో బలవన్మరణానికి పాల్పడిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సామనపల్లి స్వామి (38) ఎనిమిదేండ్లుగా ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. చిన్నతనంలోనే తండ్రి రాజయ్య గల్ఫ్‌లో మృతిచెందాడు. తల్లి మైసవ్వ (దివ్యాంగురాలు), భార్య పద్మ, కొడుకు శ్రీహన్స్ (17 నెలలు)తో కలిసి జీవిస్తున్నారు. ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న స్వామికి, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీ బస్సు స్కీంతో ఉపాధికి దెబ్బపడింది. ఆరు నెలలుగా ఆటో నడవక, నెలవారీ ఫైనాన్స్ కట్టలేకపోయాడు. ఈఎంఐలు కట్టకపోవడంతో ఇటీవలే ఫైనాన్స్ సిబ్బంది ఆటోను లాక్కెళ్లడంతో కుంగిపోయాడు. భార్య పద్మ అనారోగ్యం బారినపడడంతో మరింత అప్పుల్లో కూరుకుపోయాడు. చికిత్స తర్వాత ఆమె తల్లిగారి ఊరు చందుర్తి మండలం బండపల్లిలో ఉంటుండగా, బుధవారం ఆమెను చూసివచ్చాడు. రాత్రి తల్లి మైసవ్వకు అన్నంపెట్టి ఇంటి ముందున్న జామచెట్టుకు ఉరేసుకున్నాడు. స్వామి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వివిధ పార్టీల నాయకులతో పాటు ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

స్వామి (ఫైల్)

బిల్లు మంజూరుకు 15 లక్షల లంచం

లక్ష తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీసీఎంఎస్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్

రాంనగర్(కరీంనగర్), జూలై 4: కమీషన్ డబ్బులు మంజూరు చేయకపోగా ఎరువుల బస్తాలు అంటగడుతూ దానికీ రూ.15 లక్షలు డిమాండ్ చేసి ముందస్తుగా లక్ష లంచం తీసుకుంటూ కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన కావటి రాజు డీసీఎంఎస్ అనుసంధానంతో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాడు. 2018 నుంచి వడ్ల కొనుగోలు కమీషన్ రూ.90,16,650 డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు అడుగగా రూ.26 లక్షల విలువైన ఎరువులు పంపించి 13 శాతం కమీషన్ తీసుకున్నాడు. మిగతా రూ.64 లక్షలు అడిగితే మరో 15 లోడ్ల ఎరువుల బస్తాలు ఒక్కో లోడ్‌కు రూ.లక్ష ఇస్తే పంపిస్తానని షరతు విధించాడు. ఈ బాధ భరించలేక రాజు ఈ నెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం మేనేజర్ , జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తమ చాంబర్‌లో రాజు నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రికార్డులను పరిశీలించారు. వీరిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఏసీబీకి పట్టుబడిన మేనేజర్ వెంకటేశ్వర రావు, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి

ఎయిర్ ఇండియా మ్యాగజైన్‌లో పూర్ణ

తెలంగాణ గిరిపుత్రికకు అరుదైన గౌరవం

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన గిరిజన పుత్రిక మాలావత్ పూర్ణ మరో అరుదైన గౌరవం దక్కించింది. ఎయిర్ ఇండియా సంస్థ తన ప్రయాణికుల కోసం అందించే ఇన్‌ఫ్లైట్ మ్యాగజైన్ 'నమస్తే ఏఐ'లో చోటు దక్కించుకున్నది. తన 13 ఏండ్ల వయసులోనే పూర్ణ 2014లో మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించి రికార్డు సృష్టించింది. ఆ తరువాత కూడా పర్వతారోహణ కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. తాజాగా ఎయిర్ ఇండియా ప్రతినెలా తన ప్రయాణికుల కోసం అందిస్తున్న మ్యాగజైన్‌లో పూర్ణపై ప్రత్యేక కథనం ప్రచురించడం గర్వకారణం.

జడ్పీ వేదికపై కాంగ్రెస్ నాయకుడు

- **మంత్రి దామోదర వెనుక వైపు సీట్లో..**
- **వేదిక దిగువన కూర్చున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు**
- **అధికారుల తీరుపై విమర్శలు**

సంగారెడ్డి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జడ్పీ సమావేశం వేదికపై కాంగ్రెస్ యువ నాయకుడు ఆసీనుడు కావడం చర్చనీయాంశంగా మారింది. సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. బీఆర్ఎస్ పాలనలో జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు వేదికపైనే ఆసీనులయ్యేవారు. కాగా, గురువారం జరిగిన జడ్పీ సమావేశంలో మాత్రం మంత్రి రాజనర్సింహ, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్, సీతమ్మ వేదికపై కూర్చున్నారు. ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి వేదిక దిగువన కూర్చోగా.. అందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వినయ్‌గౌడ్ వేదికపైనే మంత్రి వెనక కుర్చీలో కూర్చున్నాడు. జడ్పీ వేదికపై కూర్చునేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలను అవకాశం ఇవ్వని అధికారులు, కాంగ్రెస్ నాయకుడు కూర్చుంటే మాత్రం నోరు మెదపలేదు. వినయ్‌గౌడ్ సమావేశం ముగిసేంత వరకు వేదికపైనే కూర్చుని మంత్రి వ్యక్తిగత, సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతూ గడిపాడు. సమావేశంలోకి కాంగ్రెస్ నాయకుడిని అనుమతించడం, వేదికపై కూర్చున్నా అధికారులు మిన్నుకుండి పోవడం చర్చనీయాంశమైంది.

సంగారెడ్డి జడ్పీ సమావేశం వేదికపై మంత్రి దామోదర వెనక వైపు కుర్చీలో కూర్చున్న కాంగ్రెస్ నాయకుడు వినయ్‌గౌడ్

సునాక్ భవితవ్యమేంటో?

- **బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలు**
- **లేబర్ పార్టీదే గెలుపంటున్న సర్వేలు**

లండన్, జూలై 4: బ్రిటన్‌లో గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన ప్రతిపక్షం, లేబర్ పార్టీ నాయకుడు స్టార్మర్ నుంచి ప్రధాని రిషి సునాక్ (అధికార కన్జర్వేటివ్ పార్టీ) గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు రిషి సునాక్, కన్జర్వేటివ్ పార్టీ భవిష్యత్తును నిర్ణయించబోతున్నది. గత 14 ఏండ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉండటం, సునాక్‌కు సవాల్‌గా మారింది. పోల్ సర్వేలు లేబర్ పార్టీ గెలుపు ఖాయమంటూ అంచనావేస్తున్నాయి. సునాక్(44), ఆయన భార్య అక్షతా మూర్తి ఉత్తర ఇంగ్లాండ్‌లోని యార్క్‌షైర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోటీలో పీవీ బంధువు

భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు దూరపు బంధువు ఉదయ్ నాగరాజు, బ్రిటన్ ఎంపీ ఎన్నికల్లో నిలబడ్డారు. కరీంనగర్ జిల్లా కోహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన కుటుంబ సభ్యులు కొన్నేండ్ల క్రితం బ్రిటన్‌లో స్థిరపడ్డారు. ఆయన లేబర్ పార్టీ తరపున ఉత్తర బెడ్‌ఫోర్డ్ షైర్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. 45 ఏండ్ల ఉదయ్ నాగరాజ్ తన గెలుపుపట్ల విశ్వాసం వ్యక్తం చేశారు.

డెమోక్రాట్ అభ్యర్థిని నేనే: బైడెన్

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున తానే అభ్యర్థినని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు. 'అధ్యక్ష ఎన్నికల్లో నేనే పార్టీ తరపున పోటీ చేస్తున్నాను. ఎన్నికల బరిలో నుంచి తప్పుకోమంటూ నాపై ఎలాంటి ఒత్తడి లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ తడబడ్డారని, ట్రంప్ వాదనకు దీటుగా సమాధానం ఇవ్వలేకపోయారని, దాంతో ఆయన ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటారంటూ మీడియా, పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ క్రమంలో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఆ ఊహాగానాలకు తెరదించారు. 'నేనేమీ ఎన్నికలను వదిలి పోవడం లేదు. నన్నెవరూ బయటకు పంపడం లేదు. మేమే ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నాం' అంటూ ధీమా వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనంలో పాము

సాంగ్లి: మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా, పాలుస్‌లో ఓ అంగన్వాడీ కేంద్రం సరఫరా చేసిన మధ్యాహ్న భోజన పొట్లంలో ఓ చిన్న పాము కనిపించింది. ఈ పొట్లాన్ని తీసుకున్న తల్లిదండ్రులు ఆ పాముతో కూడిన భోజనాన్ని ఫొటో తీసి, అంగన్వాడీ సేవికకు సోమవారం పంపించారు. ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది.

ఎన్నో టాయిలెట్లు కడిగా

- **ఎన్విడియా సీఈవో**

న్యూఢిల్లీ: అన్ని రకాల పనులనూ గౌరవించాలని, ఏ పనిని తక్కువ చేసి చూడకూడదని ప్రముఖ ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ అభిప్రాయపడ్డారు. కెరీర్ తొలినాళ్లలో తాను ఎన్నో టాయిలెట్లు కడిగానని చెప్పారు. పని విలువపై ఈ ఏడాది మార్చిలో ఆయన మాట్లాడిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

నిరుద్యోగం.. పైపైకి

జూన్ నెలలో ఎనిమిది నెలల గరిష్టానికి.. గ్రామీణ ప్రాంతాల్లో మరింత అధికం

దేశంలో 9.2 శాతానికి పెరిగిన నిరుద్యోగిత రేటు

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో నిరుద్యోగం నానాటికీ పెరుగుతున్నదని, గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువ ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామీ(సీఎంఐఈ) నిర్వహించిన సర్వేలో తేలింది. మే నెలలో 7 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు జూన్‌లో 9.2 శాతానికి పెరిగినట్టు సీఎంఐఈ వెల్లడించింది. గత ఏడాది జూన్‌లో 8.5 శాతంగా నిరుద్యోగ రేటు ఉండగా, ఈ జూన్‌లో 0.7 శాతం ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది. మహిళల్లో నిరుద్యోగం మరింత ఎక్కువగా ఉంది. గత ఏడాది జూన్‌లో 15.1 శాతంగా ఉన్న మహిళల నిరుద్యోగ రేటు ఈసారి జూన్‌లో 18.5 శాతానికి పెరిగింది. పురుషుల విషయానికి వస్తే.. గత ఏడాది జూన్‌లో 7.7 ఉండగా ఈ జూన్‌లో 7.8 శాతం ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది.

గ్రామీణ ప్రాంతాల్లో అధికం

గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం ఎక్కువగా ఉన్నట్టు ఈ సర్వే తేల్చింది. గ్రామీణ ప్రాంతాల్లో మే నెలలో 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగం జూన్‌లో 9.3 శాతానికి పెరిగింది. గత ఏడాది జూన్‌లో 8.8 శాతం ఉండగా, ఇప్పుడు 0.5 శాతం ఎగబాకింది. గ్రామీణ పురుషుల్లో నిరుద్యోగం మే నెలలో 5.4 శాతం ఉండగా జూన్‌లో 8.2 శాతానికి పెరిగింది. గ్రామీణ మహిళల్లో 12.0 శాతం నుంచి 17.1 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుదల కాస్త తక్కువగా ఉంది. మే నెలలో 8.6 శాతం నిరుద్యోగ రేటు ఉండగా జూన్‌లో 8.9 శాతానికి పెరిగింది. గ్రామీణ మహిళల కంటే పట్టణ మహిళల్లోనే నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారు. పట్టణ మహిళల్లో మే నెలలో 18.53 శాతంగా ఉన్న నిరుద్యోగం జూన్‌లో ఏకంగా 21.36 శాతానికి పెరిగింది. కాగా, కార్మిక భాగస్వామ్య రేటు(ఎల్‌పీఆర్) మేలో 40.8 శాతం, గత ఏడాది జూన్‌లో 39.9 శాతం ఉండగా ఈ జూన్‌లో మాత్రం 41.4 శాతానికి పెరిగింది. 15 ఏండ్లు పైబడిన మొత్తం జనాభాలో ఉద్యోగం చేస్తున్నవారు, చేయాలనుకుంటున్న వారు, ఎదురుచూస్తున్న వారిని కలిపి ఎల్‌పీఆర్‌గా లెక్కగడతారు.

పాక్‌లో లీటరు పాలు రూ.370

ఇస్లామాబాద్: కొత్త పన్ను కారణంగా పాకిస్థాన్‌లో పాల ధర ఐదింతలు పెరిగింది. పాల ఉత్పత్తుల ధరలు ఫ్రాన్స్, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల కంటే ఎక్కువకు చేరాయి. ప్రస్తుతం కరాచీలోని సూపర్ మార్కెట్లలో ఒక లీటర్ హెచ్‌ఎంటీ పాల ధర రూ.370 (1.33 డాలర్లు)గా ఉంది. ఇవే పాలను ఆమ్‌స్టర్‌డామ్‌లో 1.29 డాలర్లు, పారిస్‌లో 1.23 డాలర్లకు అమ్ముతున్నారని బ్లూబెర్గ్ తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి నిబంధనల మేరకు పన్ను మినహాయింపు గల పాలపై 18 శాతం పన్ను విధించారు. పాల ధర పెంపు వల్ల పిల్లల్లో పోషకాల లోపం పెరుగుతుందని ముహమ్మద్ నసీర్ అనే డైరీ యజమాని ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌లో ఐదేండ్ల లోపు చిన్నారుల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.

ఏఐ కోసం యూపీఐ లాంటి ప్లాట్‌ఫామ్!

కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) కోసం త్వరలో యూపీఐ లాంటి ప్లాట్‌ఫామ్ రావొచ్చని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సూచనప్రాయంగా తెలిపారు. బుధవారం ఢిల్లీలో ప్రారంభమైన గ్లోబల్ ఇండియా ఏఐ సదస్సు-2024ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మరికొన్ని నెలల్లో భారత్ తన ఏఐ మిషన్‌ను వెల్లడిస్తుందన్నారు. ఏఐ శక్తి సామర్థ్యాలను వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఔషధ రంగాల్లో విస్తృతంగా ఉపయోగించుకోవచ్చన్నారు. సాంకేతిక ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా ఉండాలన్నారు. ఏఐ దుర్వినియోగానికి, దాని వల్ల కలిగే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఏఐ సాయంతో తప్పుడు సమాచార వ్యాప్తి జరిగిందని ఆయన ఆరోపించారు.

8 నుంచి మోదీ రష్యా పర్యటన

న్యూఢిల్లీ, జూలై 4: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8, 9 తేదీలలో రష్యాలో పర్యటించనున్నారు. భారత్-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడంతో పాటు రెండు దేశాల మధ్య ఉన్న బహుముఖ సంబంధాల పరిధిని సమీక్షిస్తారు. రష్యా పర్యటన తర్వాత ఆయన ఆస్ట్రియాకు వెళతారు.

ఇజ్రాయెల్‌పైకి 200 రాకెట్లు

- **విరుచుకుపడ్డ హెజ్బొల్లా**

బీరూట్, జూలై 4: ఇజ్రాయెల్‌పై లెబనాన్ తీవ్రవాద దళం హెజ్బొల్లా విరుచుకుపడింది. సుమారు 200 రాకెట్లను ఇజ్రాయెల్ మిలిటరీ స్థావరాలపై ప్రయోగించినట్టు హెజ్బొల్లా ప్రతినిధులు తెలిపారు. భారీ వార్‌హెడ్‌లను అమర్చిన కత్యుషా రాకెట్లు, ఫలాక్ రాకెట్లతో పాటు పేలుడు పదార్థాలతో కూడిన డ్రోన్‌లను ఉత్తర ఇజ్రాయెల్‌తో పాటు ఆక్రమిత సిరియ్ గోలన్ హైట్స్‌పైకి ప్రయోగించినట్టు వెల్లడించారు. తమ సీనియర్ కమాండర్లను చంపినందుకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్టు వారు చెప్పారు. దాడిని ఇజ్రాయెల్ మిలిటరీ నిర్ధారించింది. లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దులో గత నెల రోజుల నుంచి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉండగా, ఇరాన్ మద్దతు ఉన్న హెజ్బొల్లా గురువారం ఈ దాడికి పూనుకుంది. కాగా, లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దు వద్ద జరుగుతున్న పరస్పర దాడులతో ఈ ప్రాంతంలో మంటలు చెలరేగుతున్నాయి. అక్కడ ఉన్న అడవులు, వ్యవసాయ భూములకు అవి వ్యాపిస్తున్నాయి.

పిండం గుట్టు రట్టు!

- **పిండం ఏర్పడే విధానం తొలిసారి చిత్రీకరణ**
- **పుట్టుకతో వచ్చే లోపాలపై పరిశోధకుల అధ్యయనం**

సిడ్నీ, జూలై 4: పుట్టుకతో వచ్చే లోపాల గుట్టు తేల్చేందుకు గానూ ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ పరిశోధకులు విప్లవాత్మక అధ్యయనాన్ని చేపట్టారు. పిండం ఏర్పడుతుండటాన్ని వీడియోగా చిత్రీకరించారు. ఇందుకు గానూ వెలుగులో రంగు మారే లైఫ్‌యాక్ట్ అనే ఫ్లోరెసెంట్ ప్రొటీన్ అనే పదార్థాన్ని వినియోగించారు. ఏర్పడుతున్నప్పుడు మనిషి పిండంతో పోలి ఉండే ఒక పిట్ట పిండంపైన ఈ అధ్యయనం చేశారు. పక్షి పిండం గ